## క్లుప్తంగా

### బోరు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలోని ఆరో వార్డు పరిధిలో ఏర్పాటు చేసే నూతన బోరు పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ప్రారంభించారు. అన్ని వార్డుల్లో బోర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కావలి సంతోష్, నాయకులు అమానుల్లాఖాన్, పరిమి సురేశ్, కమిషనర్ మనోహర్ తదితరులు ఉన్నారు.

### అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో నివాసం ఉండే మగ్గిడి లక్ష్మి(70) అనే వృద్ధురాలు సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. ఆమె అనాథ కావడంతో ఈ విషయం తెలుసుకున్న నిర్మల హృదయ సేవా సమితి సభ్యులు వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. శివాజీచౌక్ శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేశారు. సభ్యులు సాదం ఆనంద్, యాటకారి సాయన్న, వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

### పీఆర్టీయూ కార్యవర్గం



మండల కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

సోన్: జిల్లాకేంద్రంలోని పీఆర్టీయూ సంఘ భవనంలో సోమవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్రబాబు, రమణరావు ఆధ్వర్యంలో సోన్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా కాలగిరి భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుంట సాయికుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగేశ్ కుమార్, కార్యదర్శిగా ప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా శ్రీవాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

### సూపర్‌స్టార్ షోలో సెమీఫైనల్‌కు ముధోల్‌వాసి



వేదికపై అంజలి

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాల విద్యార్థిని అంజలి మహారాష్ట్రలో నిర్వహిస్తున్న మీ హోనార్ సూపర్ స్టార్ షోలో ప్రతిభ కనబరిచి సెమీఫైనల్ చేరినట్లు ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఫైనల్‌లోనూ విజేతగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

### ఎనిమిది మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌ఖిల్లా: మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లాశాఖ తరఫున సోమవారం నిర్మల్‌లోని ప్రధాన ఆసుపత్రిలో ఎనిమిది మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ హైమద్, లాయఖ్‌అలీ, వహీద్‌ఖాన్, మొయిజ్, అహ్మద్ నజీర్‌ఖాన్, షాహెద్ అహ్మద్, ఇమ్రాన్‌ఖాన్, ఆసిఫ్ అలీ తదితరులున్నారు.

### గ్రామస్తుల తీర్మానం

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో సోమవారం వీడీసీ సభ్యులు, గ్రామస్తులు వినాయక నిమజ్జనం నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ మంగళవారం నిర్వహించే నిమజ్జనం అదే రోజు రాత్రి 12 గంటల్లోపు వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి ప్రతిమలను నిమజ్జనం చేయాలని తీర్మానం చేశారు. ఎస్సై కె.గోపి మాట్లాడుతూ శోభాయాత్రలో డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### బీజేపీ సభ్యత్వ నమోదు

కుభీర్: మండలంలోని చాతా గ్రామంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు దత్తాత్రి, సభ్యత్వ నమోదు కోకన్వీనర్ జాదవ్ పండిత్ మాట్లాడారు. ఆ పార్టీ నాయకులు వినయ్, గణపతి తదితరులు ఉన్నారు.

### సన్మానం

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన మహారాజు లక్ష్మి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి ఎంపికైంది. సోమవారం నిర్మల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి లక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# లంబోదరుడికి పూజలు

- మండపాల వద్ద కుంకుమార్చనలు, అన్నదానం



ఖానాపూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు



నిర్మల్‌టౌన్: బుధవార్‌పేట్‌లో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎస్పీ జానకీ షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ ఎస్సీ కాలనీలో వినాయకుడి మండపం వద్ద సోమవారం సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు అంబేద్కర్‌నగర్ వినాయక మండపం వద్ద అన్నదానం చేశారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం మండపాల వద్ద నిర్వాహకులు భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కుంటాలలో తల్వార్ సేన యూత్ ఏర్పాటు చేసిన శ్రీరాముని రూపంలో ఉన్న వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు. ఎస్సై సీహెచ్.భాస్కరాచారి ఆధ్వర్యంలో పోలీసులు మండపాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో ఎల్లో ఫ్లవర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. గణపతి వద్ద ప్రత్యేక పూజల అనంతరం యూత్ సభ్యులు అన్నదానం ప్రారంభించారు.

**వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తులు**

నర్సాపూర్(జి): నవరాత్రులు పూజలు అందుకున్న గణేశుడి లడ్డూలను పలువురు వేలంలో దక్కించుకున్నారు. మండల కేంద్రంలోని ఆజాద్ యూత్ ఏర్పాటు చేసిన గణేశుడి లడ్డూను మన్సూర్ రాజు రూ.33 వేలు, శ్రీ సాయి అభిమన్య యూత్ లడ్డు ను పోలీస్ కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ రూ.4500, గొల్లమాడ హనుమాన్ ఆలయంలో నెలకొల్పిన గణేశుడి లడ్డూను గోస్కుల భూమయ్య రూ.8,001లకు దక్కించుకున్నారు.



కుంటాలలో పూజలు చేస్తున్న భక్తులు

**అబ్దుల్లాపూర్‌లో ఎమ్మెల్యే పూజలు**

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్‌లో మోక్ష కర్ర గణపతికి సోమవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పూజలు చేశారు. ఈ గణనాథుడిని దర్శించుకునేందు భక్తులు బారులు తీరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేశ్‌బాబు, మంద భాస్కర్, మంద గణేశ్, ఆనందర్‌రావు, మహేందర్ రెడ్డి, భోజన్న ఉన్నారు.

**వినాయకులను దర్శించుకున్న ఎస్పీ**

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు మండపాల్లో నెలకొల్పిన వినాయకులను సోమవారం జిల్లా ఎస్పీ జానకీ షర్మిల దర్శించుకున్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించారు. వారి వెంట డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



సారంగపూర్ : జామ్‌లో అన్నదానం

**మత సామరస్యం చాటిన యూసుఫ్**



సన్మానిస్తున్న నిర్వాహకులు, గ్రామస్తులు

కుంటాల: కుంటాల యువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద ముస్లిం సోదరుడు యూసుఫ్ సోమవారం రాత్రి భక్తులకు అన్నదానం చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. ఆయనను పలువురు సన్మానించి అభినందించారు. గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా నిమజ్జనం

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో బాలల గణేశులతోపాటు కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశుడి ప్రతిమల నిమజ్జనం సోమవారం ఉదయం ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం రాత్రంతా శోభాయాత్ర కొనసాగింది. గోదావరి వద్ద క్రేన్ సాయంతో చేసిన నిమజ్జనంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్ తదితరులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన సాయిగణపతి విగ్రహాన్ని సోమవారం కడెం ప్రాజెక్ట్‌లో నిమజ్జనం చేశారు. చిన్నారులు సాయి రిషి, సాయి చరణ్, లింగం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో నిమజ్జనం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామ శివాజీ యూత్ సభ్యులు భజనలు చేస్తూ వినాయకుడిని నిమజ్జనం చేశారు. 15 ఏళ్లుగా డీజేలలకు దూరం ఉంటూ భజనలతోనే శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేస్తున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు.

### నేడు మహా అన్నదానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర మంగళవారం నిర్వహించనున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్ శోభాయాత్రలో భక్తుల కోసం రూరల్ పోలీస్‌స్టేషన్, ద్యాగవాడ, గాంధీచౌక్ ప్రాంతాల్లో సుమారు 20 వేల మందికి అల్పాహారం, వాటర్ ప్యాకెట్లు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వినాయక సాగర్ వద్ద 10 వేల మందికి మహా అన్నదానం ఏర్పాటు చేశారు.

# సహకరించినందుకు ధన్యవాదాలు



మాట్లాడుతున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసాటౌన్: పట్టణంలో ఆదివారం వినాయక నవరాత్రోత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ముధోల్ ఎమ్మెల్యే పి. రామారావు పటేల్ ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన భైంసాలో విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు కృషి చేసిన హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్‌తోపాటు పోలీస్ అధికారులు, యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గణేశ్ మండలి నిర్వాహకులు, యువకులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారని, ఏటా శాంతియుత వాతావరణంలో అన్ని పండుగలు జరుపుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

### మండపం వద్ద దీపాలంకరణ

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద సోమవారం దీపారాధన చేశారు. వినాయకుడి ఆకారంలో దీపాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయ, అనిత, నాగమణి, వర్ష, రాణి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



న్యూబొప్పారంలో దీపాలు వెలిగించిన భక్తులు

# భోసిలో భక్తజన సంద్రం..

- నేడు కర్ర వినాయకుడి నిమజ్జనం

తానూరు: మండలంలోని భోసిలో ప్రతిష్ఠించిన కర్ర వినాయకుడి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సోమవారం సెలవుదినం కావడంతో మన రాష్ట్రంతోపాటు, మహారాష్ట్రలోని ఆయా ప్రాంతాల భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకొని ముడుపులు కట్టారు. హోమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అభిషేకంలో పాల్గొని పూజలు చేశారు. ముధోల్ ఎమ్మెల్యేగా రామారావ్ పటేల్ గెలిచినందుకు గ్రామానికే చెందిన ఓ భక్తుడు వెండి విగ్రహాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. కర్ర వినాయకుడి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా కృషిచేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నాగనాథ్, అధ్యక్షుడు మురళి తదితరులు ఉన్నారు. కర్ర వినాయకుడి నిమజ్జనం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నాగనాథ్, అధ్యక్షుడు మురళి తెలిపారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసారూరల్: మండలంలోని మాటేగాంలో కొరడి గణేశుడి నిమజ్జనం మంగళవారం జరుగనుంది. ఆలయం నుంచి నిమజ్జన శోభాయాత్ర జరుగనుంది. అనంతరం నీళ్ల చల్లి గదిలో గణేశుడిని భద్రపరచనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# బైక్‌ను ఢీకొట్టిన ఆటో.. ఒకరు మృతి



రాజారాం (ఫైల్)

కుభీర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ వివరాల ప్రకారం.. మండలంలోని పల్సి గ్రామానికి చెందిన పురంశెట్టి రాజారాం (27) తన పెదనాన్న కుమారుడు పరశురాంతో కలిసి బైక్‌పై పల్సి నుంచి కుభీర్ వస్తుండగా హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో రాజారాం అక్కడికక్కడే మృతి చెందగా పరశురాంకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్తతో ప్రమాదం జరిగిందని మృతుడి తండ్రి గజ్జారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ‘రైతుల పక్షాన ప్రభుత్వానికి విన్నవిస్తా’

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు గుండంపల్లి గ్రామాల నడుమ ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీతో కలిగే నష్టాలపై రైతుల పక్షాన ప్రభుత్వానికి నివేదిస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న రైతు దీక్షాశిబిరాలను సోమవారం వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా దిలావర్‌పూర్ దీక్షా శిబిరంలో మాట్లాడారు. రైతుల భూముల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఇదే విషయమై గతంలో రైతులతో మానవతా వేదిక, రైతు స్వరాజ్య వేదిక సమావేశాలు ఏర్పాటు చేసి వివరించినట్లు గుర్తు చేశారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టబోమన్నారు. దీక్షల్లో పాల్గొన్న రైతులు, మహిళలతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. ఇందులో ఇథనాల్ వ్యతిరేఖ పోరాట సమితి నాయకులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

# అమరవీరులకు ఘన నివాళి

నిర్మల్‌రూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కురన్నపేట్‌లో ఉన్న రాంజీ గోండు స్తూపం వద్ద తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉపాలి మాట్లాడారు. జిల్లాలో జరిగిన సాయుధ పోరాటానికి మాజీ ఎమ్మెల్యే దాజి శంకర్ నాయకత్వం వహించారన్నారు. నిర్మల్ ప్రాంతానికి చెందిన ముడుసు ఎల్లయ్య, గోపిడి గంగారెడ్డి, ముత్యం రెడ్డితో కలిసి పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. సాయుధ పోరాటాన్ని బీజేపీ నాయకులు హిందూ, ముస్లింల పోరాటంగా చిత్రీకరిస్తూ.. ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 19న ముధోల్ తానూరు, 20న భైంసా, నర్సాపూర్, 21న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ సాయుధ పోరాట సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుక్కా రమేశ్, సాయి, రాథోడ్ పుండలిక్, అనంతరావు, నజీర్, మసీద్, బలరాం రాథోడ్, రమేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

### నదిలో పడి ఒకరు మృతి



గణపతి(ఫైల్)

సారంగపూర్: ప్రమాదవశాత్తు నదిలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు సారంగపూర్ మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన చందల గణపతి (41) సమీప బంధువు ఇటీవల మృతి చెందడంతో అస్థికలను నదిలో కలిపేందుకు ఆదివారం స్వర్ణ నదివద్దకు వెళ్లారు. అందరూ స్నానం చేసి ఇళ్లకు చేరుకున్నారు. కానీ గణపతి మాత్రం చీకటి పడుతున్నా.. ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు నది వద్దకు వెళ్లి గంగపుత్రుల సహాయంతో గాలింపు చేయించగా సోమవారం మృతదేహం లభ్యమైంది. ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతుని భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ప్రశాంతంగా జరుపుకోవాలి

కుంటాల: మండల కేంద్రంలో మంగళవారం, గురువారం జరిగే గణేశుడి నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సీహెచ్. భాస్కరచారి ఓ ప్రకటనలో తెలిపారు. డీజేలకు అనుమతి లేదని.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### గ్రామాల్లో నిర్వహించాలి

ఖానాపూర్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని ఎంపీవో రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టాలని కోరారు.

# వర్షం.. అన్నదాతలకు కష్టం

- వానలకు దెబ్బతిన్న పంటలు
- పెట్టుబడులు వచ్చేలా లేవంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



గొడిసెరాలో తెగుళ్లు సోకిన పొలం



ధార్‌కుభీర్‌లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేను

లోకేశ్వరం: ఇటీవల కురిసిన భారీవర్షాలకు వరి, పత్తి, సోయా తదితర పంటలు దెబ్బతిన్నాయి. వరదలకు పంటలు నీటమునగడంతోపాటు అక్కడక్కడా చేన్లలో నీరు నిలువడంతో ఎదుగుదల లోపించింది. అప్పులు చేసి పెట్టుబడులు పెడితే నమ్ముకున్న అధిక వర్షాలు నట్టేట ముంచాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వర్షాల్లేక.. ఇప్పుడు వానలు ఎక్కువ కురిసి దిగుబడులు నష్టపోతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

**పెరిగిన పెట్టుబడులు..**

జిల్లాలో 90 శాతం మంది జీవనాధారం వ్యవసాయమే. వానాకాలంలో వరి, పత్తి, సోయాతోపాటు మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు. పత్తి, 1,40,000 ఎకరాల్లో వరి 1,25,000 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. పత్తిలో విత్తనం విత్తుకోవడం మొదలు.. కలుపు తీత, మందుల పిచికారీ, తదితర ఖర్చులు మొదలుకొని ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి అయిందని రైతులు చెబుతున్నారు. తరచుగా వర్షాలు కురువడంతో పత్తి చేన్లలో ఎదుగుదల లోపించింది. గతంలో ఎకరాకు 10 నుంచి15 క్వింటాళ్ల పత్తి వచ్చేదని.. ప్రస్తుతం చేన్లను చూస్తుంటే పెట్టుబడులు వచ్చేలా లేవని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు వరి పొలాలను ఎండుతెగులు ఆశిస్తుందని.. దీంతో రైతులు మందులు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకుంటున్నారు.

**వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి**

అధిక వర్షాలతో పంటల్లో ఎదుగుదల లోపించిందని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలో పత్తి చేన్లు ఎర్రబారి పోయాయి. గ్రామాల్లో పంటల పరిశీలనకు వచ్చే వ్యవసాయాధికారుల సూచనలను రైతులు పాటించి పంటలను కాపాడుకోవాలని పేర్కొన్నారు.

### వర్షాలకు ఎదగడం లేదు..



ఆరున్నర ఎకరాల్లో పత్తి పంట సాగు చేసిన. విత్తనాలు, మందులు, ఎరువులు, కలుపుతీతకు కలిపి ఎకరాకు రూ.35 వేలు ఖర్చయ్యాయి. చేనులో కాత, పూత లేదు. వర్షాలకు పంట ఎదగడం లేదు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినం. కానీ వర్షాలు మమ్మల్ని ముంచాయి. – మన్మధ్ లింగం, రాయపూర్‌కాండ్లీ, మం.లోకేశ్వరం

### మద్దతు ధర అందించాలి



ఈసారి అధిక వర్షాల కారణంగా మేం సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. మాకు ఏం చేయాలో తోచడం లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకొని పరిహారం అందించాలి. మా కు దగ్గరలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి క్వింటాలు పత్తికి రూ.9 వేల మద్దతు ధర అందించాలి.

– దత్త్రాద్రి, దార్‌కుభీర్, మం.కుభీర్

### రెండుసార్లు పిచికారీ చేశా



నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేశా. అధిక వర్షాలకు రెండు ఎకరాలకు ఎండుతెగులు సోకింది. ఇప్పటికే రూ.ఐదు వేలు వెచ్చించి రెండుసార్లు తెగులు నివారణకు పురుగుల మందు పిచికారీ చేశా. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి సూచనలు ఇవ్వాలి.

– గన్ను సుధాకర్‌రెడ్డి,పుసూర్, మం.లోకేశ్వరం

### విద్యాసామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద: ఉపాధ్యాయులు తమ బోధనలతో విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించాలని ఎస్సై సుమలత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలోని 14 గ్రామాల్లో 516 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పుస్తక పఠనం, గణితంలో నైపుణ్యం సాధించేందుకు కృషి చేస్తున్న వరల్డ్ విజన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోర్డినేటర్ బ్రహ్మన్న తదితరులు పాల్గొన్నారు.